సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ; 24 ; జూలై ; 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 24.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,293 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో జలాశయానికి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,505
3 శాతం జీఎస్టీతో	రూ.5,670
నవర (8 గ్రా)	రూ.45,360

గరిష్టం/కనిష్టం
29.1 /26.1

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 91 శాతం ఉంది. సోమవారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లుగా ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. 1వ యూనిట్లో 330, 2వ యూనిట్లో 350, 3వ యూనిట్లో 480 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు వెల్లడించారు.

రాపూరు తహసీల్దార్‌గా ఐ.శ్రీనివాస్ ప్రసాద్

నెల్లూరు(దర్గామిట్ట): రాపూరు తహసీల్దార్‌గా ఐ.శ్రీనివాస్‌ప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరు తహసీల్దార్‌గా ఉంటూ దీర్ఘకాలిక సెలవులో శ్రీనివాసరావు ఉన్నారు. తాజాగా రాపూరుకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుంది. వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకు కళాశాలలు, బ్రాంచ్‌లు ఎంపిక చేసుకునేందుకు వెబ్ ఆప్షన్ ఎంపిక ఉంటుంది. 9న వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశాన్ని కల్పించారు. వచ్చే నెల 12న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్లను విద్యార్థులకు కేటాయించనున్నారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో ఆయా కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 16వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ఫీజు ఓసీ, బీసీలు రూ.1,200, ఎస్సీ, ఎస్టీలు రూ.600 చెల్లించాల్సి ఉంది. స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా ఎలాంటి సేవలు అందించనున్నారో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకరరావు విద్యార్థులకు తెలియజేయాల్సి ఉండగా ఆయన అందుబాటులోకి రాకపోవడంపై విద్యార్థి సంఘాలు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

1,300 ఇంజినీరింగ్ సీట్లు కోత


- 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యాప్రమాణాలు లేక దుస్థితి
- మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐసీటీఈ అనుమతించిన సీట్లలో మొత్తం 1,300 సీట్లను వర్సిటీ కోత విధించింది. విద్యా ప్రమాణాలు లోపించడం, మౌలిక సదుపాయాల లేమి, అనర్హులైన, అనుభవం లేని ప్రొఫెసర్లతో బోధన, పరిశోధనలు లేకపోవడం, ఏఐసీటీఈ నిబంధనలు పాటించకపోవడం, గత మూడు సంవత్సరాల్లో అనుమతించిన సీట్ల కంటే 30 శాతం లోపు ఇంజినీరింగ్ సీట్లు భర్తీ చేయడం తదితర కారణాలతో ఈ దురవస్థ నెలకొంది. 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆ మేరకు సీట్ల కోత విధించారు. ఇందులో ఎక్కువ కంప్యూటర్ సైన్సెస్ సీట్లు కావడం గమనార్హం. మరో వైపు మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు సరైన సదుపాయాలు కల్పించకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తామని పేర్కొన్నారు.

డీఎస్పీల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 127 మంది సూపర్ న్యూమరిక్, రెగ్యులర్ డీఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. సూపర్ న్యూమరిక్ డీఎస్పీలను అడహక్ డీఎస్పీలుగా మార్చారు. ఈ మేరకు ఆదివారం రాత్రి బదిలీల ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎండీ అబ్దుల్ సుభాన్‌ను నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఎస్‌బీతోపాటు ట్రాఫిక్ బాధ్యతలను ఆయన నిర్వర్తించనున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సెల్-2 డీఎస్పీ వై.శ్రీనివాసరావును సీఐడీకి బదిలీ చేశారు. సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీరాజును సీఐడీకి బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ సీఐడీతోపాటు సీసీఎస్ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావును, నెల్లూరు నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిలను అదే స్థానంలో కొనసాగించారు.

పల్లె చెంతకే ప్రభుత్వ వైద్యం



వరికూటి రమణమ్మకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్ (ఫైల్)

జిల్లాలో..

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు - 497	నెలకు నమోదవుతున్న ఓపీలు - 40 వేలకు పైగా..	ప్రతి రోజూ నమోదవుతున్న ఓపీల సేవలు - 1,350

గతంలో చిన్న అనారోగ్యం చేసినా పట్టణాలకు పరుగులు తీయాల్సివచ్చేది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సివచ్చేది. అంతేకాకుండా పేదలు రోజు వారీ కూలిపనులు మానుకుని ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితులన్నీ గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి పెద్దపీట వేశారు. పల్లెల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. పేదల ఇంటికే వెళ్లి వైద్యసేవలు అందించేలా 'ఫ్యామిలీ డాక్టర్' అనే బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తుండడంతో పల్లె ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- వైద్యానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పేదలకు భరోసా
- గ్రామాల్లోనే 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు
- నిరంతరం వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు

నడవలేని స్థితిలో ఉన్నా..

ఈ ఫొటోలోని 89 ఏళ్ల వృద్ధురాలి పేరు వరికూటి రమణమ్మ. ఈమెది పొదలకూరు మండలం వెలికంటిపాళెం గ్రామం. ఐదేళ్ల క్రితం కాలు విరిగి మంచానికే పరిమితమయ్యారు. సాధారణ పరీక్షల కోసం రమణమ్మను ఆమె పిల్లలు పొదలకూరుకు తీసుకువస్తుంటారు. ఆమె నడవలేని స్థితిలో ఉండడంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్‌ను తీసుకురావడంతో మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ ఆమె ఇంటికే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన బీపీ, షుగర్ మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తనలాంటి వృద్ధులకు ఎంతో మేలు చేస్తోందని రమణమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు



ఉలవపాడులో శేషమ్మ ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

ఉలవపాడులోని వరిగచేను సంఘంలో ఉంటున్న 77 ఏళ్ల వృద్ధురాలు రాపూరి శేషమ్మ నరాల సంబంధించిన వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉంది. మనిషి పట్టుకుంటేనే నడుస్తుంది. ఆమెను వైద్యశాలకు తీసుకెళ్లాలంటే చాలా అవస్థలు పడాల్సిఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఈ వృద్ధురాలికి భరోసానిస్తోంది. కరేడు వైద్యులు శ్రీనివాసరావు, రమ్యజ్యోతి నెలలో రెండుసార్లు శేషమ్మ ఇంటికి వచ్చి ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. తర్వాత ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటుంటారు. తమ ఊరిలోనే, తన ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తుండడంతో శేషమ్మ, ఆమె కుటుంబసభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.



ఈ ఫొటోలో వైద్యాధికారితో పరీక్షలు చేయించుకుంటున్న 65 ఏళ్ల వృద్ధుడి పేరు మునగాల నారాయణ. ఈయన పొదలకూరు పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో నివాసం ఉంటున్నారు. నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ అమలు చేస్తుండడంతో డాక్టర్ నెలలో రెండుసార్లు నేరుగా నారాయణ ఇంటికే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేస్తుండడంతో నారాయణతోపాటు, కుటుంబసభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

నాలుగేళ్లుగా పక్షవాతం



నారాయణకు వైద్యం చేస్తున్న డాక్టర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వైద్యాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రాధాన్యం ఇవ్వగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు వైద్యాన్ని చేరువ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పల్లె చెంతకే ప్రభుత్వ వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి 2,550 మంది జనాభాకు ఒక డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. దీని వల్ల చిన్న చిన్న అనారోగ్యానికి పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇందుకోసం బీఎస్సీ నర్సింగ్ కోర్సు అర్హత కలిగిన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంహెచ్‌పీ)లను నియమించి వైద్యసేవలు అందిస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 12 రకాల సేవలు

జిల్లాలో మొత్తం 61 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) ఉన్నాయి. వాటిలో 122 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ఆయా పీహెచ్‌సీల్లోని వైద్యులు ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరొక వైద్యుడు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తారు. ఇలా ఒకరోజు ఒక వైద్యుడు విలేజ్ క్లినిక్‌కు వెళ్తే, మరుసటి రోజు మరో వైద్యుడు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తున్నారు. ఇలా ఒక్కో డాక్టర్ నెలలో 13 రోజులపాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శిస్తున్నారు. జిల్లాలో 497 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉండగా అందులో ఎంహెచ్‌పీలు అందుబాటులో ఉన్నారు. ఈ హెల్త్ క్లినిక్‌లలో 12 రకాల వైద్యసేవలు అందిస్తున్నారు. 14 రకాల వైద్యపరీక్షలు చేస్తున్నారు. 67 రకాల బేసిక్ ఎక్విప్‌మెంట్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ హెల్త్ క్లినిక్లన్నింటిలో ఏఎన్‌ఎంలు 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. అలాగే హెల్త్ అసిస్టెంట్‌తోపాటు ఆశా కార్యకర్తలు క్లినిక్‌లో ఉంటూ సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పీహెచ్‌సీలు, ల్యాబ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేశారు. తద్వారా టెలీమెడిసిన్ వైద్యసదుపాయాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మండలానికి రెండు పీహెచ్‌సీలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు చొప్పున వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల ఆరోగ్యానికి సంబంధించి స్పష్టమైన సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచారు.



ఆత్మకూరు మండలం ఆరవీడు ఎస్టీకాలనీలో టీబీ రోగికి పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ రాకేష్

నెలలో రెండుసార్లు సందర్శన

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పీహెచ్‌సీలోని వైద్యులు నెలలో రెండు సందర్శిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఉండి రోగులను పరీక్షిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు హెల్త్ క్లినిక్‌కు రాలేని వృద్ధులు, అనారోగ్యంతో మంచంలోనే ఉంటున్న వారి ఇంటికే వెళ్లి సదరు వైద్యుడు వైద్యసేవలందిస్తున్నారు.

నెలవారీగా 40 వేల ఓపీలు

జిల్లావ్యాప్తంగా 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నెలకు సగటున దాదాపు 40 వేలకు పైగా ఓపీలు నమోదవుతున్నాయి. అంటే రోజుకు 1,350 ఓపీల సేవలు అందిస్తున్నారు. ఇలా గత పది నెలలుగా 4,03,545 ఓపీలు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. పది నెలల క్రితం 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను కూడా ప్రభుత్వం ప్రారంభించడంతో పేదలకు భరోసా ఏర్పడింది. వైద్యులే పల్లెకు వచ్చి సేవలందించడంపై గ్రామీణ ప్రాంతాల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భరతనాట్యంతో అరుణాచల గిరిప్రదక్షిణ

- సింహపురి బాలిక భవ్యహాసిని నృత్య నీరాజనం
- 14.5 కిలోమీటర్లు.. 3.36 గంటల వ్యవధిలో సాహసం



భరతనాట్యంతో గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న భవ్యహాసిని

నెల్లూరు(బృందావనం): సింహపురికి చెందిన నాట్యకళాకారిణి నల్లంగు భవ్యహాసిని తన నాట్యప్రదర్శనతో మరో సాహసం చేసింది. పన్నెండేళ్ల భవ్యహాసిని ఆదివారం భరతనాట్యంతో 14.5 కిలోమీటర్ల అరుణాచల గిరిప్రదక్షిణను 3.36 గంటల వ్యవధిలో పూర్తి చేసిఅరుణాచలేశ్వరుడికి నృత్యనీరాజనం అర్పించింది. భవ్యహాసిని తల్లిదండ్రులు చెంచులక్ష్మి, సునీల్‌కుమార్, నాట్యగురువులు కళాదీప్తి కామాక్షీసుబ్రహ్మణ్యం తిరువణ్ణామలై(అరుణాచలం) నుంచి తెలిపిన వివరాల మేరకు తన నాట్యకళను పరమేశ్వరుడి సన్నిధిలో ప్రదర్శించాలన్న తలంపుతో హరిహరాదులను కీర్తిస్తూ భక్తిగీతాలతో, అన్నమాచార్య, రామదాసు సంకీర్తనలతో, తిల్లానా పదరవళులతో తమిళనాడులోని తిరువణామలైలో తెల్లవారుజామున 5.20 గంటలకు భరతనాట్య ప్రదర్శన ప్రారంభించి ఉదయం 8.56 గంటలకు పూర్తి చేశారు. గత 9 నెలలుగా అకుంఠిత సాధన చేసిన భవ్యహాసిని అరుణాచల గిరిప్రదక్షిణను పూర్తిచేసినట్లు తెలిపారు. కాగా పరమేశ్వరుని చెంత నిర్విరామంగా నాట్యప్రదర్శన చేపట్టడం తన పూర్వజన్మ సుకృతమని భవ్యహాసిని తెలిపారు.

క్రీడలపై సీఎం ప్రత్యేక దృష్టి



రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో గ్రామీణస్థాయి నుంచి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కన్నా వైభవంగా క్రీడల నిర్వహణ, క్రీడాకారులకు ప్రోత్సాహం అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కరోనా నేపథ్యంలో సన్నగిల్లిన క్రీడాసక్తి క్రమంగా వేగం పుంజుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో క్రీడలకు మరింత ప్రోత్సాహం ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా నెల్లూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ సీఎం కప్, 'ఆడుదాం ఆంధ్ర' ఈవెంట్‌ల ద్వారా బ్యాడ్మింటన్ క్రీడాకారులకు తమ ప్రతిభను మెరుగుపరచుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 250 జట్లు టోర్నీలో తలపడుతున్నాయని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి తీసుకున్న చర్యలు, అద్భుత ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ప్రస్తుతం బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించడం ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన 'ఆడుదాం ఆంధ్ర'లో బ్యాడ్మింటన్ క్రీడను చేర్చడం సంతోషదాయకమన్నారు. సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభచూపిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను వారి క్రీడా అవసరాలను గత 13 ఏళ్లుగా తీరుస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు మంగళవారం వరకు జరుగనున్నాయన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకమచౌదరి, కోశాధికారి వంశీ, సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ నాగరాజకుమారి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దూడల సుధాకర్, నిమ్మల వీరవెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటశ్రీకాంత్, సహాయ కార్యదర్శి మద్దిపాటి ప్రసాదరావు, వరప్రసాద్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల బ్యాడ్మింటన్ క్రీడాకారులు, అసోసియేషన్‌ల ప్రతినిధులు, అఫీషియల్ టీమ్ పాల్గొన్నారు.

లాభాల పంట

- వేరుశనగ సాగులో అధిక దిగుబడులు
- ముమ్మరంగా కోతలు
- ఆశాజనకంగా ధరలు
- రైతుల ఆనందం



ఈ చిత్రంలోని రైతు పంగా శ్రీనివాసరెడ్డి. ఇతనిది వింజమూరు మండలం తమిదపాడు గ్రామం. ఈ ఏడాది ఏప్రిల్ చివరలో తనకు ఉన్న 1.32 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. రెండ్రోజుల క్రితం వేరుశనగ పంటను కూలీలతో పెరికించారు. దిగుబడి ఎకరాకు 40 బస్తాల(40 కేజీలు)పైనే రావచ్చు. మొత్తం తన పొలంలో 55 బస్తాల దిగుబడి రావచ్చు. పెట్టుబడి రూ.50 వేలు అయింది. అన్ని ఖర్చులు పోను రూ.80 వేల వరకు మిగులుతోంది. మూడున్నర నెలల్లో ఈ ఆదాయం రావడంపై రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



ఈ చిత్రంలోని రైతు గుడిమెట్ల శ్రీనివాసులు. వింజమూరు మండలం జువ్వకుంటపల్లి ఇతని సొంతూరు. తనకున్న 4 ఎకరాల భూమిలో 3.5 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ఎకరానికి 40 బస్తాల దిగుబడి వచ్చింది. ఒక ఎకరానికి సాగు ఖర్చులు రూ.50 వేలు అయింది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.60 వేల వరకు మిగిలింది. ఈ లాభాలు కేవలం ఈ ఇద్దరు రైతులకే కాదు. ఈ ఏడాది వేరుశనగ సాగు చేసిన అందరూ రైతులూ మంచి లాభాలు గడించారు.



దుత్తలూరులో సాగులో ఉన్న వేరుశనగ పైరు

ఉదయగిరి: వేరుశనగ సాగు రైతులకు లాభాలు కురిపిస్తోంది. ఈ ఏడాది కూడా మంచి దిగుబడులతోపాటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. ప్రభుత్వం కూడా విత్తనాలను సబ్సిడీపై అందజేసి సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో వేరుశనగ సాగు చేసే రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. తీరప్రాంతాల్లో కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. జిల్లాలో వేరుశనగ సాగు చేసిన రైతులు ఈ ఏడాది మంచి లాభాలు గడిస్తున్నారు. గత మూడేళ్ల నుంచి మంచి దిడుబడులతోపాటు ధరలు ఎక్కువగా ఉండడంతో ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ముఖ్యంగా విడవలూరు, కావలి, ఇందుకూరుపేట, బోగోలు తీర మండలాల్లో బిందుసేద్యం ద్వారా వేరుశనగ సాగు చేస్తున్నారు. దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, పొదలకూరు, బుచ్చిరెడ్డిపాళెం, వింజమూరు, కలిగిరి, మర్రిపాడు, దగదర్తి మండలాల్లో కూడా గత రెండేళ్ల నుంచి రైతులు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్లో మంచి గిరాకీ

జిల్లాలో ట్యాగ్-24, కే-8 రకాల వేరుశనగ ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంట 120-140 రోజుల వ్యవధిలో కోతకు రావడంతోపాటు కాయ పరిమాణం, నాణ్యత బాగా ఉండడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీంతో ధర కూడా బాగా పలుకుతోంది. ఎకరాకు 40 బస్తాల(40 కేజీలు) వరకు దిగుబడి ఉంది. బస్తా ధర రూ.3 వేలకు పైగా పలుకుతోంది. రెండేళ్ల నుంచి ఇవే ధరలు ఉండడంతో అన్నదాతలకు గిట్టుబాటు అవుతోంది. ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఎకరాకు సగటున రూ.75 వేల వరకు లాభం వస్తుండడంతో రైతులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు రాయితీలు

వేరుశనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ రూపంలో కొంతమేర సాయం అందిస్తోంది. బిందుసేద్యం పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతరులకు 60 రాయితీతో అందిస్తున్నారు. వ్యవసాయ పరికరాలు కూడా రాయితీతో ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వ సహకారంతో పాటు వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది రైతులకు మంచి లాభాలు వచ్చాయి.

జిల్లాలో..

వేరుశనగ పంట సాగు విస్తీర్ణం : **15,200** ఎకరాలు

సాగు చేసిన రైతులు : **2,214** మంది

ఎన్ని మండలాల్లో.. : **25**

ప్రస్తుతం బస్తా(40 కేజీల) ధర : రూ.**3** వేలు

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వేరుశనగ సాగులో రైతులు మంచి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. వేరుశనగ సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. తెగుళ్లు, పురుగులు గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపడితే మంచి లాభాలు వస్తాయి.

– రామిరెడ్డి, ఏడీ, వింజమూరు

కొడవలూరులో వ్యక్తి హత్య



హత్యకు గురైన బాషా

కొడవలూరు: ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న లత అనే మహిళకు ఇద్దరు కుమారులు. ఈమె భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి బేల్దారి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కొన్నేళ్ల క్రితం ఆమెతోపాటు బేల్దారి పనులు చేసే బాషా (45)తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. లత ఇద్దరు పిల్లలు బాతులు మేపుతూ ఇటీవల పొరుగు జిల్లాలకు వెళ్లారు. ఆదివారం రాత్రి బాషా గాయాలతో మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని మృతిపై ఆరా తీశారు. మృతుడి మర్మాంగంపైన కత్తిగాట్లు ఉండడం, వృషణాలు పగిలి ఉండడంతో హత్యకు గురైనట్లు భావిస్తున్నారు. ప్రియురాలే హత్యకు పాల్పడిందా.. లేదా మరెవరైనా హత్య చేసి ఉంటారా.. అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

క్లుప్తంగా

గ్యాస్ లీకేజీతో చెలరేగిన మంటలు



గ్యాస్ లీకేజీను అదుపు చేసి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కలిగిరి: మండలంలోని తెల్లపాడు ఎస్సీ కాలనీలో గంగపట్ల కొండమ్మ నివాసంలో ఆదివారం వంట గ్యాస్ సిలిండర్ లీకవడంతో మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో పేతూరు అనే వ్యక్తి సాయంతో కొండమ్మ కొత్త సిలిండర్‌ను అమర్చి స్టౌ వెలిగించగా, రెగ్యులేటర్ వద్ద నుంచి గ్యాస్ లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమై వెంటనే సిలిండర్‌ను ఇంటి బయటపడేశారు. మంటలు ఆరిపోయినప్పటికీ గ్యాస్ లీకవుతుండడంతో కాలనీవాసులు భయాందోళనలతో వింజమూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గ్యాస్ లీకేజీని ఆపివేశారు. దీంతో కాలనీవాసులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం గ్యాస్ సిలిండర్లతో జరిగే అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు.

కారు ఢీకొని యువకుడి మృతి



బాషు మృతదేహం

గుడ్లూరు: రోడ్డు దాటుతున్న యువకుడ్ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై తెట్టు వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. తెట్టు గ్రామంలోని తూర్పుపాళేనికి చెందిన షేక్ బాషు(33) పడమర వైపు ఉన్న సుల్తాన్‌బీబీ దర్గా వద్దకు వెళ్లేందుకు ఫ్లైఓవర్‌పై జాతీయ రహదారిని దాటుతుండగా నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాషు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గుడ్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 150

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 38
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ. 7

రోగుల మృతిపై ఆరోపణలు అవాస్తవం

- ఆక్సిజన్ లేక మృతి చెందారనే ప్రచారంలో వాస్తవం లేదు
- కొన్ని మీడియాలు దుష్ప్రచారం చేశాయి
- దాంతో ప్రజలకు మేలు జరగదు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రోగుల మృతికి సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో ఈ నెల 21న ఆక్సిజన్, సరైన వైద్యసేవలు అందక ఆరుగురు రోగులు మృతి చెందారనే ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జీజీహెచ్‌లోని ఎంఐసీయూ వార్డును వైద్యాధికారులతో కలిసి మంత్రి కాకాణి సందర్శించారు. ఎంఐసీయూ వార్డులో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్‌లో ఒకే రోజు ఆరుగురు రోగులు మరణించడంపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని, అందులో వాస్తవం లేదన్నారు. ఈ ఘటన నేపథ్యంలో కలెక్టర్, డీఎంహెచ్‌ఓ స్వయంగా జీజీహెచ్‌ను సందర్శించి మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో పాటు విచారణకు ఆదేశించారన్నారు. ఆస్పత్రిలో జరిగిన మరణాలపై డీఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్‌తో పూర్తి స్థాయిలో విచారణ జరిపించామని, చనిపోయిన వారంతా వయోభారం, వివిధ అనారోగ్య సమస్యలతో ఆరోగ్యం క్షీణించడంతో మరణించారని తేలిందన్నారు. అయితే కొందరు ఆక్సిజన్ కొరతతోనే మరణించారని దుష్ప్రచారం చేశారన్నారు. వాస్తవానికి వారంతా ఆక్సిజన్ బెడ్లపై లేరని, వారికి ఆక్సిజన్ అవసరం లేదని తెలిపారు. లిక్విడ్ ఆక్సిజన్ సమృద్ధిగా ఉందన్నారు. అదనంగా 300 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో తాను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశానని, తప్పును తప్పు, వాస్తవాన్ని వాస్తవమనే చెప్పాలని, ఎక్కడన్నా ఆరోపణలు వస్తే ఖండించాలన్నారు. ఈ విషయంలో ఎవరూ కూడా ఉపేక్షించరాదన్నారు. కొన్ని సందర్భాల్లో తన దగ్గరికి చాలా మంది వచ్చారన్నారు. వారంతా మా కుటుంబ సభ్యులకు చెన్నై, నెల్లూరులోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించామని, అయినప్పటికీ వారి ఆరోగ్యం క్షీణించి చివరి దశలో ఉన్నారని, లాభం లేదని ఇంటికి తీసుకెళ్లండని వైద్యులు చెప్పారని, జీజీహెచ్‌లో చేర్పించి ఏదోక విధంగా చికిత్స అందించాలని తనను కోరారని, తాను వైద్యులతో మాట్లాడి వారికి నర్సింగ్ కేర్‌ను అందించామన్నారు. ఆ తరువాత వారు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించారని తెలిపారు. ఇలా తనలాగే ఇతర ప్రజాప్రతినిధుల వద్దకు అనేక మంది క్లిష్టతరమైన పరిస్థితుల్లో వైద్యసేవలు అందించాలని రావడం..వారు వైద్యులకు సిఫార్సు చేయడం చేస్తుంటారని వివరించారు. జీజీహెచ్‌లో వైద్యులు, మందులు, మౌలిక వసతులు, సిబ్బందికి కొరత లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆస్పత్రి మీద దుష్ప్రచారం చేయడం వలన సమాజానికి మేలు జరుగుతుందా..చెడ్డ జరుగుతుందా అనే విషయాన్ని మీడియా, దుష్ప్రచారం చేస్తున్న వారు ఆలోచన చేయాలని సూచించారు. ఆస్పత్రులపై దుష్ప్రచారం మంచి పద్ధతి కాదన్నారు. కొన్ని మీడియాలు పనిగట్టుకుని ఏదో జరగరానిది జరిగిపోయిందని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎల్లో మీడియాలు ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార పార్టీ నేతలతో పాటు వివరకు వ్యవస్థలపైన దాడి చేస్తున్నాయని విమర్శించారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడం కన్నా దారుణం మరొకటి లేదన్నారు. ఇటువంటి దుష్ప్రచారాలను పట్టించుకోవద్దని మీకు మేమంతా అండగా ఉన్నామని వైద్యులకు మంత్రి కాకాణి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ ఐవీ రామచంద్రరావు, వైద్యులు గంగాధర్, మస్తాన్‌బాషా, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సింహపురిలో మణిపూర్ ప్రకంపనలు

- కుకి వర్గానికి చెందిన వ్యక్తి మృతిపై జాతీయస్థాయిలో చర్చ
- మణిపూర్ పోలీస్ ఉన్నతాధికారుల ఆరా
- సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరుగుతున్న మారణహోమం ప్రకంపనలు సింహపురిని తాకాయి. అసోంకు చెందిన కుకి వర్గానికి చెందిన ఇమానియేల్ నెల్లూరులో మృతిచెందడం జాతీయస్థాయిలో కలకలం రేపింది. ఇదీ మైతేయ తెగవారే హత్య చేసి ఉంటారన్న అనుమానం నెల్లూరు పోలీస్‌శాఖను హడలెత్తించింది. గత నాలుగు రోజులుగా గుంటూరు రేంజ్ ఐజీ స్థాయి అధికారి నెల్లూరులోనే తిష్టవేశారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి అతని ఆత్మహత్య వెనుక స్థానిక పోలీస్ అధికారుల నిర్లక్ష్యం ఉందని నిర్ధారించి వారిపై కేసులు నమోదు చేయడం ఆ శాఖలో కలకలం రేపింది.

జరిగింది ఇలా..

అసోంకు చెందిన ఇమానియేల్ ఉపాధి నిమిత్తం తన స్నేహితులతో కేరళకు వెళుతూ ఈ నెల 16వ తేదీన వెంకటాచలం రైల్వేస్టేషన్‌లో రైలు దిగాడు. అక్కడ కొందరిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంకటాచలం పోలీసులకు, డయల్ 100కు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఇమానియేల్ కానిస్టేబుళ్ల పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. పోలీసులు అతని వివరాలను ఆరా తీసి అతని కుటుంబసభ్యులతో మాట్లాడించారు. రాత్రి వరకు ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకురాకపోవడం, ఇమానియేల్ అనుచిత ప్రవర్తన నేపథ్యంలో అతన్ని పోలీస్ వాహనంలో నెల్లూరుకు తరలించారు. ఈ క్రమంలో బుజబుజనెల్లూరు–పడారుపల్లి జాతీయ రహదారి మధ్యలోకి వచ్చేసరికి ఇమానియేల్ వాహనంలో ఉన్న హోంగార్డ్‌పై దాడి చేసి బయటకు దూకేసి పరారయ్యాడు. అతను పరారవుతున్న సమయంలో పోలీసులు వెంబడించి పట్టుకోలేకపోయారు. సమీపంలో వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులు వెళ్లిపోయారు. కానీ ఇమానియేల్ స్థానికంగా ఉన్న వంతెనపై నుంచి కిందకు దూకడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

పోలీస్‌శాఖ నిర్లక్ష్యం ఎలా ఉందంటే..

ఇమానియేల్ పోలీస్ వాహనం నుంచి దూకి పరారైన సంగతిని వెంకటాచలం పోలీసులు దాచారు. పోలీస్ ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో వ్యక్తి మృతిపై ఐదో నగర పట్టణ పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. కానీ ఇమానియేల్‌కు కాళ్లు, చేతులకు గొలుసులుండడంతో స్థానిక పోలీసులకు అనుమానం వచ్చి జిల్లా పోలీస్‌బాస్‌కు సమాచారం ఇచ్చారు. మృతుడికి గొలుసులు వేసి ఉండడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఆరా తీయగా వెంకటాచలం పోలీసుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది.

మణిపూర్ పోలీసులు ఆరా

ఇమానియేల్ మణిపూర్‌లోని కుకి తెగకు చెందిన వ్యక్తి కావడంతో ఈ ఘటన జాతీయస్థాయిలో చర్చకు వచ్చింది. ఇమానియేల్ బంధువులు అతన్ని మైతేయ తెగకు చెందిన వారు హత్య చేశారని అనుమానం వ్యక్తం చేయడం, మణిపూర్ ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో కలకలం రేగింది. నెల్లూరులో కూడా కుకి తెగకు చెందిన వ్యక్తిని హత్య చేశారన్న అనుమానంపై మణిపూర్ అట్టుడికిపోయింది. ఈ విషయంపై మణిపూర్ పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజ్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఈ ఘటనపై విచారించి వెంకటాచలం పోలీసుల నిర్లక్ష్యం ఉందని నిర్ధారించారు.

పోలీసులపై కేసు నమోదు

ఇమానియేల్ మృతిలో పోలీసుల నిర్లక్ష్యం ఉందని పోలీస్ ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో వెంకటాచలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఏఎస్సై శ్రీనాథ్, కానిస్టేబుల్ లక్ష్మీకాంత్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడంతోపాటు ఎస్సై అయ్యప్ప, కానిస్టేబుల్స్ నాగేంద్ర, మదన్‌కుమార్, హోంగార్డులు ఎ.మధు, మధుసూదన్‌రావులను వీఆర్‌కు పంపుతూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ ఏడుగురిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మత్స్యకారులకు అండగా సీఎం జగన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ బీద, ఎమ్మెల్యే రామిరెడ్డి

- ఎంపీ బీద, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని, ఆయనకు రానున్న రోజుల్లో మత్స్యకారులందరూ అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కావలి నియోజకవర్గంలోని మత్స్యకారులతో ఆత్మీయ సమావేశాన్ని కావలిలోని ఆర్‌ఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ మత్స్యకారులు టీడీపీని, ఆ పార్టీ గుర్తుసైకిల్‌ను మరిచిపోయారన్నారు. అందుకే మత్స్యకారులు సైకిల్‌ను కూడా వాడడం లేదన్నారు. నియోజకవర్గంలోని మత్స్యకారులు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న మేరకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకారులు సంతోషంగా ఉన్నారన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రామాయపట్నం పోర్టు కూడా ప్రారంభమవుతుందన్నారు. కావలి–తుమ్మలపెంట రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి మత్స్యకార గ్రామాల ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని మత్స్యకారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేబాల కాలువలో స్కూల్ బస్సు బోల్తా

- కాలువలో కొద్దిపాటి నీరుండడంతో తప్పిన ముప్పు
- వైఎస్సార్‌సీపీ నాయకుడి సహకారంతో ఉపాధ్యాయులు సురక్షితం



కాలువలో పడిన బస్సు నుంచి ఉపాధ్యాయులను బయటకుతీస్తున్న యువత

సంగం: జెండాదిబ్బ పంచాయతీ పరిధిలోని అరవపాళెం వద్ద రేబాల–నాగమాంబాపురం కాలువలో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన బస్సు ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో అక్కడున్న జెండాదిబ్బకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరయ్య యువత సహకారంతో బస్సులోని 30 మంది ఉపాధ్యాయులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. స్థానికుల వివరాల మేరకు.. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీపీ రావు సంతాప సభను నెల్లూరులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరులోని శ్రీచైతన్య విద్యా సంస్థకు చెందిన బస్సు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులతో ఉదయం బయలుదేరి వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి ఆత్మకూరుకు బయలుదేరిన బస్సు జెండాదిబ్బలో కొందరు ఉపాధ్యాయులను దించింది. అనంతరం దండుబాట, సదరన్ చానల్ సమీపంలోని రిజర్వాయిర్ రోడ్డు మీదుగా సంగం వైపునకు బయలుదేరింది. అయితే రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో రేబాల కాలువపై రోడ్డు బురదగా ఉండడంతో బస్సు అదుపు తప్పి అందులో బోల్తా పడింది. దీంతో బస్సులోని ఉపాధ్యాయులు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరయ్య గమనించి గ్రామ యువకుల సాయంతో వారిని సురక్షితంగా బయటకు చేర్చారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ఉపాధ్యాయులు స్వల్పంగా గాయపడగా 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. మిగిలిన వారు మరో బస్సులో ఆత్మకూరుకు బయలుదేరి వెళ్లారు. సంగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బస్సును బయటకు తీసే ప్రయత్నం చేశారు.

వాస్తవాలు చెబితే ఉలుకెందుకు..?

- ప్రతిపక్షాలకు నేదురుమల్లి ప్రశ్న



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): వెంకటగిరి సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాస్తవాలు మాట్లాడితే కొందరు ఎందుకు ఉలిక్కిపడుతున్నారో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వెంకటగిరి సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ, కొందరు వ్యవహరిస్తున్న తీరుపై వాస్తవాలు మాట్లాడారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని కొందరు ఇష్టానుసారంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంది ఆనం కాదా...

రాజకీయంగా కనుమరుగవుతున్న ఆనం రామనారాయణరెడ్డికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నమ్మక ద్రోహం చేశాడని మండిపడ్డారు. అల్తూరుపాడు రిజర్వాయర్ విషయంలో గత ప్రభుత్వంలో చీకట్లో టెంకాయ కొట్టి కనీసం ఒక్క తట్టమట్టి పని కూడా చేయలేదన్నారు. ఆ తరువాత ఆనం కూడా అక్కడి టీడీపీ వాళ్లతో చీకటి ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటూ వచ్చారన్నారు. అల్తూరుపాడు విషయంలో గతంలో ఏమి జరిగింది..ప్రస్తుతం ఏమి జరుగుతోంది అనే విషయంపై చర్చకు తాను సిద్ధమని విమర్శలు చేసే వారికి సవాల్ విసిరారు.

సీఎంకు ధన్యవాదాలు

వెంకటగిరి సభలో అల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణ పనులకు నిధులు కేటాయించడం, ఎంతో విశిష్టత కలిగిన వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండగగా ప్రకటించడం, పెంచలకోన క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఇందుకు వెంకటగిరి ప్రజల తరఫున సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇటీవల వెంకటగిరి నియోజకవర్గంలో ఏడు రోజుల పాటు లోకేశ్ పాదయాత్ర చేస్తే పట్టుమని ఏడుగురు కూడా లేరన్నారు. వెంకటగిరిలో జరిగిన సీఎం సభకు భారీగా జనాలు రావడంతో రాష్ట్రం మొత్తం ఒక్కసారిగా ఇటు వైపు చూసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలు సాధిస్తామన్నారు. తమ కుటుంబం ఎప్పుడూ ఆర్భాటాలకు పోదాని, అభివృద్ధిని చేసుకుంటూ పోతామని గుర్తుచేశారు. కొందరు నాయకులు వలంటీర్లను ఇష్టానుసారంగా మాట్లాడడం సిగ్గుచేటని, అటువంటి మాటలు మానుకోవాలని హితవుపలికారు.

జనరల్ నోటీసు

నెల్లూరు జిల్లా, తడ మండలము చేనిగుంట కాపురస్థుడు సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు లేట్ వేనాటి పరంధామరెడ్డి గారు తన స్థిరాస్తులను ఆంధ్రాబ్యాంకు (Union Bank of India) సూళ్ళూరుపేట బ్రాంచిలో VPR Constructions సూళ్ళూరుపేట తరఫున తనఖా (Mortgage) వేలము వేయుటకు (E Auction) ప్రయత్నము చేయుచున్నారని, కాని లేట్ వేనాటి పరంధామరెడ్డి గారి కుమార్తెకు హక్కు కలిగి యున్నందున తనకు రావలసిన భాగము పంపకము చేయమని లేట్ పరంధామరెడ్డి మిగిలిన వారసులు, బ్యాంకు పైన నెల్లూరు (8వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో O.S.No.43/2022 లను భాగ పంపకము దావా (Partition Suit) వేసి అందులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని బ్యాంకు వారు వేలము జరపకుండా నిలుపు చేయమని కోరుతూ I.A.No.39/2022 వేసి వున్నందున కేసు పెండింగ్‌లో ఉన్నది. మరియు వారి అయిన Venati Srutha Keerthi బ్యాంకు వారు వేలం జరపకూడదని Debt Recovery Tribunal (DRT) వైజాగ్‌లో S.A.No.186/2022 పిటీషన్ కూడా వేసి ఉన్నది. కావున ఈ క్రింది షెడ్యూలు ఆస్తులపైన బ్యాంకు వారు వేలము జరపకూడదని మరియు వేలములో ఎవరైన పాల్గొనిన నష్టనష్టాలు కలుగుతాయని మరియు వర్యలకు బాధ్యులు అగుదురు అని ఇందుమూలముగా అందరికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు

Item No.1 : సుమారు ఎ.9.43సెంట్లు విస్తీర్ణం గల ఆస్తి తడ గ్రామం, సర్వే నెం.97/1బి/2 లోని ఎ.6.50 సెంట్లు వేనాటి పరంధామరెడ్డి గారికి చెందిన ఖాళీ భూమి, దీనికి సర్వే నెం.93/1ఎ లోని ఎ.0.60 సెంట్లు మరియు సర్వే నెం.93/2ఎ/2 లోని ఎ.2.33 సెంట్లు వేనాటి పరంధామరెడ్డి గారికి చెందిన ఖాళీ భూమి.

Item No.2 : ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా-గూడూరు-రిజిస్ట్రేషన్-సూళ్ళూరుపేట సబ్ రిజిస్ట్రార్-తడ రెవెన్యూ మండలము-తడ కంబ్రిగ గ్రామ పంచాయతీలోని 1). సర్వే నెం.114-4ఎ లోని ప్లాటు నెం.26కి చెందిన ఎ.0.26 అంకణములు 9.36 చ.అ.లు 2).సర్వే.నెం. 114-4ఎ లోని ప్లాటు నెం.19లోని ఎ 0.26 అంకణములు మరియు 9.36 చ.అ 3). సర్వే నెం. 114-4ఎ లోని ప్లాటు నెం.20 మరియు 25కి చెందిన ఎ 0.36 అంకణములు మరియు 64 చ.అ.లు

Item No.3 : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-2, హరనాథపురం రెసిడెన్షియల్ ప్లాటు నెం.డి4 (డూప్లెక్స్) దేగ హోమ్స్ అపార్ట్‌మెంట్, 3వ మరియు 4వ అంతస్తులు 2250 చ.అ.లు విస్తీర్ణం ఆస్తి వేనాటి పరంధామరెడ్డి గారి పేరున కలదు.

VENATI CHANDRA SEKHAR REDDY B.A., B.L.,
Advocate